## పిల్లల చేరికకు కదలండి



వివరాలు మెయిన్‌లో...



# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 31 మే, 2024 | పేజీలు : 05


# జిల్లాలో విత్తనాలకు కొరత లేదు.. ఆందోళన వద్దు

**విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు**
**నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు నమోదు**
**నకిలీ విత్తనాలపై  అవగాహన కల్పిస్తాం**
**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాలో ఎలాంటి విత్తనాల కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో విత్తనాల కొరత, నకిలీ విత్తనాలపై ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, వాతావరణ శాఖ సూచనల  ప్రకారం ఈసారి గత సంవత్సరం కంటే పది రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించనున్నాయని అందువల్ల గతం కంటే పది రోజుల ముందుగానే వర్షాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.  రైతులు సాగుకు సమాయత్తం అవుతున్న దృష్ట్యా విత్తనాలు కొరత లేదని సమృద్ధిగా ఉన్నాయన్నారు. జిల్లాలో గత సంవత్సరం 1 లక్షా 11 వేల ఎకరాలలో వరి  సాగు  అయిందని,  ఈ సంవత్సరం లక్ష  5 వేల ఎకరాలలో వరి, 18 వేల ఎకరాలలో మిరప, లక్ష  ఎకరాలలో పత్తి పంట సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని అన్నారు.  వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో విత్తనాలకు ఎలాంటి కొరత లేదని ఎవరైనా కావాలని కృత్రిమ విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.  ఇప్పటి వరకు జిల్లాకు 43 వేల పత్తి విత్తనాల పాకెట్స్ వచ్చాయని, వాటిలో 3 వేల పాకెట్స్ విక్రయించారని, ఇంకనూ 40 వేల పాకెట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే అదనంగా 50 వేల పాకెట్స్ వస్తున్నామని అన్నారు. అలాగే వరి 35 వేల వరి విత్తనాలు సరఫరా కాగా ఇప్పటి వరకు 1300 క్వింటాళ్లు విక్రయించారని తెలిపారు.  విత్తనాలు కొరత ఉన్నట్లు రైతులను తప్పు దోవ పట్టిస్తున్నారని, అపోహలు సృష్టిస్తున్నారని అలాంటి తప్పుడు సమాచారాన్ని రైతులు నమ్మొద్దని అన్నారు.  అనంతరం జిల్లా కేంద్రంలోని శివ సాయి బాబా ఫర్టీలైజర్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఫర్టీలైజర్ దుకాణంలో కొనుగోలు అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్ ను, విత్తనాల ప్యాకెట్లను, నిల్వ స్టాకు ను  పరిశీలించారు. స్టాకు వివరాలు పెట్టాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల రశీదును భద్రపరచాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యాన అధికారి సంజీవ రావు,ఏ.ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# రాయితీపై
## పచ్చిరొట్ట పంటల విత్తనాల సరఫరా

**జిల్లా కలెక్టర క్రాంతి వల్లూరు**

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** ప్రస్తుత వాన కాలం 2024 సీజన్‌కు గాను సంగారెడ్డి జిల్లాకు 3900 క్వింటాళ్ల జిలుగు విత్తనం 1981 క్వింటాళ్ల జనుము విత్తనం మొత్తం 5881క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు కేటియించడం జరిగిందని జిల్లా కలెక్టర క్రాంతి వల్లూరు తెలిపారు. ఇందులో ప్రస్తుతం 2217 క్వింటల జిలుగు విత్తనం 1981 క్వింటాళ్ల జనుము విత్తనం మొత్తం 4198 క్వింటాళ్ల పచ్చిరొట్ట గురువారం వరకు అందుబాటులో ఉన్నవని. ఈ విత్తనం జిల్లా మొత్తం 55 సెంటర్ల ద్వారా రైతు సోదరులకు సరఫరా చేయడం జరగుతున్నదని. మిగిలిన కేటాయించిన విత్తనం 1683 క్వింటాళ్ల జిలుగు విత్తనం కూడా రాబోయే 23 రోజులలో అందుబాటులో ఉంచుతామని రైతు సోదరులకు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత వానాకాలం 2024 సీజన్ కు గాను సంగారెడ్డి జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం సుమారు 3,60,000 ఎకరాలలో సాగు అవుతుందని, అంచనా వేయడం జరిగిందని . ఇందుకు గాను 7,20,0000 ప్యాకెట్ల విత్తనం అవసరమవుతుందని తేదీ 29052024 పత్తి విత్తనాల ప్యాకెట్లు 3,76,422 సంగారెడ్డి జిల్లాలో అందుబాటులో ఉన్నవని ఇప్పటి వరకు పత్తి రైతులు 85,107 ప్యాకెట్ల విత్తనం కొనుగోలు చేయడం జరిగిందని జిల్లాలో సరిపడా విత్తనాలు కూడా 34 రోజులలో అన్ని అధికృత విత్తన డీలర్లకు కంపెనీల ద్వారా విత్తన సరఫరా జరుగుతుందని రైతు సోదరులు పత్తి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా బిల్లు రసీదు పత్తి రకం మోతాదు లాట నంబర్ విధిగా పొందుపరిచినట్లు చూసుకోవాలని మనవి చేయచున్నారు. ఏ విత్తన డీలర్లైన ఎమ్ఆర్పీ కంటె ఎక్కువ ధరకు అమ్మినట్లయితే సంబందిత మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకురాగలరని  అధిక ధరలకు అమ్మిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోబడునని జిల్లా కలెక్టర క్రాంతి వల్లూరు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి**



**ప్రజాపక్షం/తొర్రూరు :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దని అండగా ఉంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని మడిపెల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి సాయిమల్లును పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నెం సోమిరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల వలే పని చేయాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదగాని సోమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోశ్, లింగాల వేంకటనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మేరుగు మల్లేశంగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందాడి అచ్చిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్వి రాజేశ్‌యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి, నాయకులు వెంకన్న, మహేశ్ యాదవ్, సోమేశ్వర్, చంటి తదితరులు ఉన్నారు.

# ఖబడ్దార్..నాగరాజ్..ఆర్ఎస్పీపై నోరు జారితే జాగ్రత



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట పట్టణకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తూళ్ల కుమారాస్వామి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పై బీఆర్ఎస్ నాయకుడు మంద శ్యాం ఫైర్ అయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే నాగరాజుకు లేదని, ఇంకోసారి నోరు జారితే నాగరాజుని గల్లీలో కూడా తిరుగనీయమని హెచ్చరించారు. స్వేరోలు రౌడీషీటర్లు అన్న నాగరాజు డీసీపీ గా పనిచేసిన కాలంలో ఎంతమంది స్వేరోల మీద రౌడీషీటర్లు ఓపెన్ చేశాడో లెక్కచెప్పాలని డిమాండ్ చేశారు. అదృష్టం కలిసివచ్చి ఎమ్మెల్యే అయిన నాగరాజు సీఎం రేవంత్ దగ్గర మార్కుల కోసం దిగజారి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వల్ల ఎంతోమంది బడుగు బలహీనవర్గాల బిడ్డలు బాగుపడ్డారని, ఎస్పై నుంచి సీపీ దాకా ఎదిగిన నాగరాజు వల్ల ఒక్కడైనా బాగుపడ్డడా..? అని ప్రశ్నించారు. మార్పు అంటే పరిపాలనలో రావాలి,సంక్షేమ పథకాలలో రావాలి తప్ప రాష్ట్ర గేయాన్ని మరుస్తా, లేకుంటే రాష్ట్ర చిహ్నన్ని మరుస్థా అంటే అది నీ పార్టీ దిగజారుడు స్థానాన్ని చూపెడుతుంది. ఇంకో సారి స్వేరోలను, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ ను విమర్శిస్తే ఊరుకునేది లేదని, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే నాగరాజును హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తుమ్మల యాకయ్య, సిల్వేరు కుమారస్వామి, జన్ను రాములు, పిట్టల రాజు, కొండేటి శ్రీనివాస్, కంజర్ల రవి, మహేష్, ఎలికట్ట్ యాకయ్య, కొండేటి సుధాకర్, కొండేటి భాస్కర్, గబ్బిట బాబు, మరపెల్లి వంశీ, తల్లపెల్లి వెంకటస్వామి, బొట్ల కార్తిక్, ప్రశాంత్, జీలకర్ర దివాకర్, శగ అరుణ్, మదరపు విజయ్, మంద మహేష్, సంకినేని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ కమలాపూర్:** అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఆయా గ్రామాలలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి గుండె బాబు సూచించారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు మండలంలోని గోపాల్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా నడుస్తున్న పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్న వివో లకు సూచనలు, సలహాలు అందజేశారు. త్వరితగతిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులన్ని పూర్తి చేయాలని, అదే విధంగా ప్రతి పాఠశాలలోను పంచాయతీ కార్యదర్శులు, వివోల సహకారంతో పాఠశాల భవనం పై పడుతున్న వర్షపు నీటిని ఇంకించే ప్రక్రియలో భాగంగా ప్రతి పాఠశాలలో ఉపాధీ హామీ నిధుల కింద రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్ ను నిర్మించాల్సిందిగా సూచించారు. ఈ పనులన్నింటిని జూన్ 5 లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాటి, ఈత వనం దగ్ధం



**ప్రజాపక్షం/సంగెం:** మండల కేంద్రంలో గీత కార్మికుల సొంత భూమి 1.35 ఎకరాల్లో తాటి, ఈత చెట్లను గత 15 ఏళ్ల నుంచి పెంచుతున్నారు. గురువారం ఉదయం సమయంలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు తాటి వనానికి నిప్పంటించారా.. లేక అకస్మాత్తుగా మంటలు చెలరేగాయా.. ఏది ఏమైనప్పటికీ తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వేసవి కాలం ఎండ వేడికి మంటలు ఎగిసిపడుతూ తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో తాటి, ఈత చెట్లను నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు తీవ్ర నష్టం జరిగిందని స్థానిక గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆర్థికంగా ఉపాధి కోల్పోయి తమను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారు వచ్చేసరికి తాటి, ఈత వనం పూర్తి దగ్ధమైందన్నారు.

## ఎన్‌సిసిబి సర్టిఫికెట్ ఎంతో విలువైంది




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** నగరంలోని ఎల్ బి కళాశాల లో ఎన్సిసి ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ నుండి 100 ఎన్సీసీ బీ సర్టిఫికెట్ పాస్ అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. వరంగల్ గ్రూప్ అండ్ సిసి లో 100 ఫలితాలు సాధించిన ఎన్సిసి విభాగాన్ని అభినందించారు. ఈ ఎన్సిసి బి సర్టిఫికెట్ విద్యార్థులకు ఎంతో విలువైనదని,భవిష్యత్తులో ఉన్నత మైన ఉద్యోగ అవకాశాల్లో ఉన్నత విద్యలో ప్రత్యేక రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందుతారని, ఆర్మీలో నేరుగా ప్రవేశించడానికి ఈ సర్టిఫికెట్ ఎంతో దోహదపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మంచి ప్రతిభా కనబరిచి కళాశాలకు 100 ఫలితాలు సాధించిన ప్రతి ఎన్సిసి క్యాండిడేట్స్ను ప్రిన్సిపాల్ తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి ఆర్మీ విభాగం ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, సీనియర్ అండ్ ఆఫీసర్ బాల జోహార్, రాజ్ కుమార్, సంతోషి జూనియర్ అండ్ ఆఫీసర్, సృజన, కళ్యాణ్, శృతి, వర్ష, బి సర్టిఫికెట్ పాస్ అయిన క్యాండిడేట్స్ ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాఠశాలలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/మహాముత్తారం :** ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మరమ్మతులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి మహాముత్తారం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పాఠశాలల్లో జరుగుతున్నమరమ్మతు పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిథిలా వస్థలో ఉన్న ప్రభుత్వ బడులు ఆధునికతను సంతరించుకొని విద్యార్థులకు ఆహ్లాదకరంగా తయారు చేయడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేసేందుకు అనుకూలంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముందుగా మహాముత్తారం మండలం కోనంపేట గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 3.94 లక్షల రూపాయలతో చేపట్టిన మరమ్మతులను, కొత్త ముత్తారం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 3.84 లక్షలతో చేపట్టిన పనులు, మహాముత్తారం గ్రామంలోని కెజిబివి పాఠశాలలో 6.30 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 5వ తేదీ వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశాలలు పున: ప్రారంభానికి ముందు పూర్తిస్థాయిలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వివోలను ఆదేశించారు. అంతకు ముందు రైతు వేదిక ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా కుట్టించిన స్కూలు యూనిఫామ్స్ ధరించిన చిన్నారులు జిల్లా కలెక్టర్ కు పూలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫోర్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి




**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** ఆటో కార్మికులకు ట్రాన్స్‌ఫోర్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి కుటుంబాలకు నెలకు రూ.15వేల భృతి ఇవ్వాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని కార్యాలయంలో కార్మిక సంఘాల రౌండ్ టేండ్ సమావేశాన్ని నిర్వహించారు. కార్మిక సంఘాల రౌండ్ టేండ్ సమావేశంలో మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ట్రాన్స్‌ఫోర్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. కార్మిక భవన్ నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిధులు కెటాయించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కార్మికులందరికి కల్పించాలని కోరారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను పదవిలో ఉన్నా, లేకున్నా ప్రభుత్వంలో ఉన్నా, లేకున్నా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్మికులకు ఎల్లవేళలా తోడుగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్మిక సదస్సు జరుగుతుందని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ నాయిని రవి, పి.శ్రీనివాస్, నాయకులు మల్లేశం, రవీందర్‌రెడ్డి, సారంగపాణి, ప్రవీణ్, సంజీవ, శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, రాజు, బిక్షపతి, కృష్ణ, ఎస్.రవితో పాటు పలు సంఘాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## సిఐ హరికృష్ణ శభాష్.....




**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండలం సిఐ గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ కు వరంగల్ జిల్లా సిపి అంబర్ కిషోర్ ఝు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఇటీవల జరిగిన ఎంపి, ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేసిన హరికృష్ణ కు ప్రశంసా పత్రాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో హరికృష్ణ సిపి తో పాటు ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమలాపూర్ మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, మిత్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రేటర్ వరంగల్ పరిధి 2వ డివిజన్‌లోని వంగపహాడ్‌లో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కౌలు రైతు కన్నెబోయిన సాంబయ్యకి ఇఫ్కో ఫర్టిలైజర్ ఢిల్లీ వారు రూ. 1 లక్ష ప్రమాద బీమా చెక్కును మృతుని భార్యకు అందచేశారు. వంగపహాడ్ ప్యాక్స్ ఛైర్మన్ మేర్గు రాజేష్‌గౌడ్, ఇఫ్కో కంపనీ వారు ఇఫ్కో యూరియా వాడిన రైతులకు ప్రమాద బీమా వర్తిస్తుందని ఆయా గ్రామాల రైతులు సొసైటీల్లో మన జిల్లా వ్యవసాయాధికారులు చెప్పే ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన మందులను మాత్రమే వాడాలన్నారు. ప్రతీ రైతు సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలని ఛైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జూలూరి రాజ్‌కుమార్, డైరెక్టర్ తెట్టె గణేష్, సీఈఓ రాజిరెడ్డి, పరమేశ్, స్వామి పాల్గొన్నారు.

## లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌కు పితృ వియోగం




**ప్రజాపక్షం/పాలకుర్తి:** సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రాజ తండ్రి ఎల్లయ్య గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎల్లయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై మృతిచెందాడని వారు చెప్పారు. మృతుని కుటుంబాన్ని సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) రాష్ట్ర, జిల్లా నాయకులు ఎల్లయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## క్రీడాకారులకు యూనిఫామ్‌లు పంపిణి




**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఈనెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు డీవైఎస్‌వో జనగామ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నూర్ గ్రామంలో జరుగుతున్న సాఫ్ట్ బాల్, వాలీవాల్ క్రీడల వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగింపులో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొలుగూరి యాకయ్య క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం వల్ల విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నోముల సతీష్, ఆకారపు ఉపేందర్, నరేష్, రవి, జోడు సంతోష్, వెంకన్న, నారగాని ఎల్లయ్య, వెంకన్న, ప్రశాంత్, సోమయ్య, సాధిక్, సందీప్, పాల్గొన్నారు.

## కురుమ గొంగడికి యునెస్కో గుర్తింపు లభించడం హర్షణీయం



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రెండు తెలుగు రాష్ట్రాల్లో కురుమ సామాజిక వర్గానికి ప్రధాన వస్త్రంగా ధరిస్తున్నటువంటి గొంగడికి యునెస్కో గుర్తింపు లభించడం పట్ల కురుమ యువజన చైతన్యసమితి రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ ఉషా రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 47 రకాల విశిష్ట చేనేత సాంప్రదాయ దుస్తులను ప్రజలు ధరిస్తూ ఉంటారన్నారు. అందులో గొల్ల కురుమలు ధరించే ప్రధాన వస్త్రం గొంగడి చలికాలంలో వెచ్చగాను, ఎండకాలంలో చల్లగాను, వర్షకాలంలో మనిషి తడవకుండా ఉంచడం, తదితర కారణాల వల్ల గొంగడికి యునెస్కో ప్రత్యేక స్థానం ఇచ్చినట్లు తెలిపారు. భారతదేశంలో గొల్ల కురుమలకు ప్రత్యేక గుర్తిపు దక్కడం అభినందనీయమని ఆమె అన్నారు.

## ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగ రాజు పై స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, స్వేరోస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఐత ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బహుజన నినాదంతో సబ్బండ వర్గాలను మోసం చేసి దొర కాళ్ల దగ్గర భాంచన్ గిరి చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్వేరో పేరుతో బహుజనులను మోసం చేశారని ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పదవిలో ఉన్నప్పుడు చేసిన అవినీతి అక్రమాలు బయటపడతాయనే భయంతో ముందస్తుగా పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారని ఆరోపించారు. తన రాజకీయ స్వార్థం కోసం బహుజన సమాజాన్ని వాడుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాయలో బహుజన సమాజం మగ్గవద్దని సూచించారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/మహాముత్తారం :** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు జన్మదిన గురువారం వేడుకలు మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జనహృదయ నేత మంథని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా మహా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పక్కల సడవలి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చేయాల్సిన ఏర్పాట్లపై గురువారం కమిషనర్ క్షేత్రస్థాయిలో కార్యాలయ ఆవరణలో పర్యటించి పరిశీలన చేసి సమర్థవంతంగా ఏర్పాట్లు చేయడానికి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రధాన ద్వారం వద్ద గల పోర్టికో వద్ద జెండా ఆవిష్కరించు ప్రాంతంతో పాటు గాంధీ విగ్రహం ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ వేడుకలను అట్టహాసంగా నిర్వహించడానికి కార్యాలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేయాలని వేడుకలు నిర్వహించే ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కుర్చీల ఏర్పాటుతో పాటు నీడ ఉండేలా టెంట్ ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించి ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న కార్పొరేటర్లందరూ ఆవిర్భావ వేడుకలలో పాల్గొనే విధంగా ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ రమేష్, ఈఈ సంజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బాలింతలు, శిశు మరణాలు జరగకుండా చూడాలి



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** ములుగు జిల్లాలో మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో ప్రతి మంగళ, గురు వారాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న సేవలు రోగుల ద్వారా ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సూపర్‌వైజర్లు సిబ్బందితో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు కొత్తగా జనవరి 2024 నుండి నూతనంగా నిర్వహిస్తున్న బాలింతల ఆరోగ్య సంరక్షణ, శిశు, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా మాతా శిశు మరణాలు రేటును తగ్గించాలని కమిషనర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ప్రసవం అనంతరం తల్లి బిడ్డలను 45 రోజులు కనీసం 6 నుండి 7 సార్లు సందర్శించి, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేస్తూ స్టేట్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ములుగు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక బాలింత మరణం సంభవించిందని రాబోయే రోజుల్లో ఇలాంటి మరణాలు జరగకుండా వైద్యులు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు అవగాహన చేయాలని సూచించారు. ఆయన వెంట మాతా శిశు సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ రిషిత, డాక్టర్ భవ్య, హెల్త్ ఎడ్యుకేటర్ భాస్కర్, పిహెచ్ఎన్ఓ శోభ, ఏఎన్ఎంలు స్వప్న, కనక లక్ష్మి, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, శోభ, కవిత, సంపూర్ణ, ఇందిర, పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం సెంటర్‌ను మార్చండి




**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయడంతో పిల్లలకు డస్ట్ ఎలర్జీ, శ్వాసకోస వ్యాధుల సక్రమించే ప్రమాదం పొంచి ఉన్నదని కొనుగోలు కేంద్రానిన వేరే చోటుకు మార్చాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. వరి, మొక్కజొన్న, రెండు పంటలకు నాలుగు పర్యాయాలు పాఠశాల ఆవరణలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని, ఈ సమస్యతో పిల్లలు పాఠశాలకు వెళ్ళ లేకుండా ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు పదవ తరగతి వరకు చదివించిన పిల్లలు చదువు మానేస్తే ఎలా ఉంటుందో అని ఆందోళనతో అప్పులు చేసి ప్రయివేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందుకే జిల్లా కలెక్టర్‌ను గ్రామస్తులం కోరుతున్నామని గ్రామానికి చెందిన కిషన్ అన్నారు. గ్రామంలో ప్రభుత్వానికి సంబంధించిన ఐదు ఎకరాల ఆరు గుంటల స్థలం ఉందని ఆ స్థలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామ ప్రజలు అన్నారు. ప్రభుత్వానికి చెందిన ఐదు ఎకరాల ఆరు గుంటల ఖాళీ స్థలం నక్షను జిల్లా కలెక్టర్‌కు పంపించారు.

## మానవత్వం చాటుకున్న శ్రీనివాస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** నిజాయితీ నువ్వెక్కడ అంటే నేను ఎప్పుడో చచ్చిపోయాను అన్నట్లుంటుంది. ఈ రోజుల్లో ప్రక్కన ఉన్నోన్ని ఎప్పుడు ముంచుదామని చూసే స్వార్థ పరులే ఎక్కువగా ఉంటారు ఈ సమాజంలో కానీ దానికి విరుద్ధంగా ఓ వ్యాపారి నిజాయితీ బతికే ఉందని నిరూపించాడు. వివరాల్లోకి వెళితే ములుగు మండలం పందికుంట కు చెందిన పత్తిపాక సాంబయ్య అనే సింగరేణి ఉద్యోగి ములుగులోని ఎస్బిఐ బ్యాంక్‌లో రూ.350000 మూడు లక్షల యాభై వేలు తీసుకొని ములుగు జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి కిరాణం వద్దకు వెళ్ళి సరుకులు తీసుకొని డబ్బుల కవరును అక్కడే మరిచి వెళ్ళిపోయాడు. అక్కడ ఉన్న కవరును కిరాణా షాప్ యజమాని ఆడేపు శ్రీనివాస్ తీసి చూడగా అందులో డబ్బులు ఉన్నాయి. కొంత సమయం తర్వాత బాధితుడు వచ్చి అడుగగా అతడి వివరాలు అడిగి అందులో ఎంతో ఉందో తెలుసుకొని అతడికి డబ్బులను శ్రీనివాస్ అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అందుకు గాను బాధితుడు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం చుట్టు ప్రక్కల వారికి తెలియడంతో శ్రీనివాస్ యొక్క మంచితనాన్ని పలువురు ప్రశంసించారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన బాల్య స్నేహితులు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని పస్రా గ్రామంలో ఇటీవల మే 13, 2024న అనారోగ్యంతో మరణించి చిన్ననాటి మిత్రుడు వేముల శ్రీకాంత్ కుటుంబానికి ఆయన 2000 సంవత్సరంలో విద్యనభ్యసించిన బాల్య స్నేహితులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వెలుగు రిపోర్టర్ కృష్ణ సహాయంతో తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి రూ.5వేలు, ఏటూరునాగారం ఎస్ఐ కృష్ణ ప్రసాద్‌లు, తమ మిత్రులు కలిపి మొత్తం రూ.50వేలు బాధిత కుటుంబానికి అందించారు. వాటిని మృతుడి కుమార్తెల మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి గొప్ప మనసు చాటుకున్నారు. ఏ కష్టం వచ్చిన తాము వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/మల్హర్:** ప్రజా పాలనకు పునాదులు వేసిన ప్రజా మేనిఫెస్టో రూపకర్త తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు పులిగంటి సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట శ్రీనివాస్, బిఎస్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ యువ నాయకులు వేణుగోపాల్, తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ చంద్రశేఖర్, ఓయూ బిఎస్ఎఫ్ అధ్యక్షులు అంబేద్కర్ తో పాటు యూనివర్సిటీ స్కాలర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ హేమాచల లక్ష్మీనృసింహ-స్వామి ఉండిల లెక్కింపు



**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం ప్రసిద్ధి పుణ్యక్షేత్రం స్వయంబుగా వెలసిన శ్రీ హేమాచల శ్రీ లక్ష్మినృసింహ స్వామి బ్రహ్మోత్సవాలా భాగంగా జాతరకు వచ్చిన భక్తులు దేవస్థానం కు సమర్పించిన కానుకలు మొక్కుబడుల నిమిత్తం తేది. 2732024 నుండి తేది. 2952024 వరకు 13 హుండి లు ఏర్పాటు చేయగా నోట్ల ద్వారా రూ. 11,31,920/ లు నాణెముల ద్వారా రూ. 30,854/ మొత్తం రూ. 11,62,774/అక్షరాలు (పదకొండు లక్షల ఇరవై రెండు వెల ఏడువందల డెబ్బై నాలుగు రూపాయలు) ఆదాయము వచ్చింది ఇతర దేశ కరెన్సీ అనగా యుఎస్ఏ డాలర్స్ 15, మలేషియ డాలర్స్ 2 వచ్చాయి. ఇట్టి కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మహేష్ దేవాదాధర్మాదాయ శాఖ, మహుబుబాద్ డివిజన్ పరిశీలకులు కవిత, ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ, రాఘవ చార్యులు, ఈశ్వర్ చంద్ శర్మ, పవన్ కుమార్ చార్యులు, అలయ సిబ్బంది నిమ్మల రాజు జానపదాలు కళాకారు బృందం పాల్గొన్నారు.

## గ్రామాల్లో పల్లె సమగ్ర సేవ కేంద్రం (మీసేవ) మహిళ విఎల్ఈలతో అవగాహన సమావేశం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా సమీకృత కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పల్లె సమగ్ర సేవ కేంద్రం విఎల్ఈ లకు మీసేవ అప్లికేషన్ లు చేసేటప్పుడు ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, ఇతర సర్వీసుల పైన అవగాహన కల్పించటం జరిగింది. మహబూబాబాద్ జిల్లాలో ముప్పై ఏడు గ్రామాలకు చెందిన మహిళా విఎల్ఈ లు మీటింగ్ లో పాల్గొన్నారు. మీటింగ్ లో తమ సమస్యలను అధికారులకు మహిళ విఎల్ఈలు వివరించటం జరిగింది. వారి సలహాలను, సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ (మీసేవా) ప్రశాంత్, శ్రీనిధి రిజినల్ మేనేజర్ మధుసుధన్ పాల్గొన్నారు.

# పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించడం

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ కళావతి బాయి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 31న జరుపుకుంటామని, ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యం పొగాకు వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడమన్నారు. పొగాకు నియంత్రణ విధానములో మార్పుల చేయడంకోసం, పొగాకు నియంత్రణను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకొని ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనం, భవిష్యత్తు తరాలను రక్షించడానికి దోహదం చేయాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క సభ్య దేశాలు 1987లో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని ఏర్పాటు చేశాయని పేర్కొన్నారు. ఒక దేశం యొక్క పొగాకుకు సంబంధించిన ప్రస్తుత, భవిష్యత్తు స్థితిని చర్చించడానికి కూడా ఒక ప్రత్యేకత గా ఉపయోగించబడుతుందన్నారు. ఉదాహరణకు పొగాకు వినియోగంలో భారతదేశం 275 మిలియన్ల పొగాకు వినియోగదారులతో ప్రపంచంలో అత్యధిక స్థాయిలో ఉంది అని దేశంలో విస్తృతంగా వ్యాపిస్తున్న వ్యసనాన్ని అరికట్టేందుకు భారత ప్రభుత్వం ధూమపాన విరమణ హెల్ప్‌లైన్‌ను కూడా ప్రారంభించింది అని తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం థీమ్ "పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించడం". అని తెలిపారు. పొగాకు ఉపయోగించడం వలన ప్రపంచవ్యాప్తంగా దాని వినియోగదారులలో సగం మందిని చంపుతుంది. 80 పొగాకు





వినియోగదారులు తక్కువ, మధ్యాదాయ దేశాలలో నివసిస్తున్నారు. ఆరోగ్య విద్యా కార్యక్రమాలు, ప్రచారాలు, కమ్యూనిటీ ఔట్రీచ్ ద్వారా పొగాకు వాడకం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలను గురించి సమాచారాన్ని ప్రజలలోకి విరివిగా తీసుకెళ్లవలిసిన ఆవశ్యకత చాలావుంది. పొగాకు ఉత్పత్తులను మానివేయాలనుకునే పొగాకు వినియోగదారులకు కౌన్సెలింగ్, హెల్ప్ లైన్లు మరియు అవగాహన కార్యక్రమములు నిర్వహించాలి. అవగాహన పెంచడానికి మరియు పొగాకు రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి పాఠశాలలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సంస్థలతో కలిసి పని చేయాలి. పొగాకు రహిత భవిష్యత్తును సృష్టించడంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులను చేయాలి అన్నారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/గజ్వేల్: వర్గల్ శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తుంకుంట నర్సారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మోహన్, తాజా మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు యాదగిరి గౌడ్, లక్ష్మీనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్ ఉన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత..



ప్రజాపక్షం/బెజ్జంకి: మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుండి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకొని స్థానిక పోలీస్టేషన్‌కు తరలించారు.అక్రమ ఇసుక రవాణాను చేపడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

## కడుపునొప్పి భాధ భరించలేక యువకుడు ఆత్మహత్య..



ప్రజాపక్షం/బెజ్జంకి: కడుపునొప్పి భాధ భరించలేక యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రేగులపల్లి గ్రామ శివారులోని గురువారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోహెడ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన గొంటి తిరుపతి (24) ఉదయం ఇంటి నుండి తమ వ్యవసాయ పొలం వద్దకు పశువులను మేపడానికి వెళ్తున్నానని చెప్పి మధ్యాహ్నం అయిన ఇంటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు వెళ్లి వెతకగా పల్లోటి హై స్కూల్ సమీపంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద గల రూంలో ఉరి వేసుకొని ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి తండ్రి గొంటి అంజయ్య ఇచ్చిన పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## నిజాంపేటలో సివిల్ రైట్స్ డే



ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల ఎస్సీ ప్రైమరీ పాఠశాల ఆవరణలో గురువారం రోజున స్థానిక ఎస్సై శ్రీనివాస రెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంగాధర్ గౌడ్, ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా అంటరానితనం కుల వివక్ష హోటలలో రెండు గ్లాసుల పద్ధతి దేవాలయాల ప్రవేశం లో ఆటంకాలు ఉన్న సమస్యలు ఉన్న మా దృష్టికి తేవాలన్నారు. గ్రామంలో పౌరులకు ఏవైనా వివక్ష లాంటి సమస్యలు ఎదురైన సంబంధిత అధికారులకు తెలియజేస్తూ చట్టపరమైన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జస్టిస్ పున్నయ్య సిఫారసుల మేరకు ప్రతి నెల చివరి రోజు అయిన 30 వ తేదీ లలో ఏదో ఒక గ్రామంలో సంబంధిత ఎస్సీ కాలనీలో ఈ యొక్క కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ కొమ్మటబాబు గ్రామ కార్యదర్శి నర్సింలు, డీజే రాజు, బండారి రాములు, గరుగుల మేకల ఎల్లం, బత్తుల శీను, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో... రాక్షస పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్



ప్రజాపక్షం/గజ్వేల్: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్ లో ఆయన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, వైస్ చైర్మన్ జకియొద్దిన్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ సారథ్యంలో రూపొందించిన కాకతీయుల కళాతోరణం, చార్మినార్ గుర్తులను తొలగిస్తామనడం సిగ్గుచేటని నిలదీశారు. గత ప్రభుత్వంపై నిందలు వేయడం, బురద చల్లడానికి బదులు ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాజముద్రను మార్చడం తెలంగాణ ఆత్మపై దెబ్బ కొట్టడమేనని నిలదీశారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నం తొలగిస్తే ఊరుకునేది లేదని అన్నారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ పద్మశాలి సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు, నేతలు గోపాల్ రెడ్డి, రజిత గౌడ్, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రెడ్డి, రహీం, గంగిశెట్టి రవీందర్, కనకయ్య, శ్రీనివాస్ గుప్త, మామిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 4న జరిగే కౌటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధిః సంగారెడ్డి పోలీసు కార్యాలయం నందు పోలీసు అదికారులతో సమీక్ష సమావేశం జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెచ్ఓపి ఎన్నికలను ప్రశాంతంగా ముగించుకొని ఎన్నికలలో చివరి కీలక ఘట్టమైన కౌటింగ్ దశకు చేరుకున్నామని, జూన్ 4వ తేదిన గీతం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కౌటింగ్ కు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు సూచనలు చేశారు. కౌటింగ్‌కు వచ్చే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ,కార్యకర్తలకు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద టారికెట్స్ ఏర్పాటు చేయాలని ఎంట్రీ పాస్లు లేనిదే ఎవ్వరిని లోనికి అనుమతించరాదన్నారు. కౌటింగ్ హాల్ లోపలికి ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిషేదిత వస్తువులను అనుమతించరాదన్నారు.కౌటింగ్ ప్రారంభమైన తరువాత ప్రతి రౌండ్ అనంతరం మీడియా పాంట్ వద్ద అనౌన్స్మెంట్ వస్తుందని ఎవ్వరు కూడా అదైర్యపడవలసిన పని లేదన్నారు. దేశానికి అన్నం పెట్టె అన్నదాతను మోసం చేస్తే సహించేదేలేదన్నారు. నకిలీ విత్తనాలను గుర్తించడానికి గ్రామాల వారిగా అగ్రికల్చర్ అదికారులతో పనిచేయా




లని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. జూన్ 9వ తేదిన జరిగే గ్రూప్ 1 పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ప్రతి పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి గాను ప్రధాన రోడ్డు నుండి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్ నందున్న సూచనలను తప్పని సరిగా పాటించాలని ఉదయం 10 గంటల తరువాత పరీక్ష కేంద్రంలోనికి ఎవ్వరిని అనుమతించరని అభ్యర్థులు ఒక గంట ముందు గానే పరిక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ సంజీవరావు, డిఎస్పీ లు సత్తయ్యగౌడ్ రవీందర్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి ,వెంకట రెడ్డి ,వేణుగోపాల్ రెడ్డి ఎస్బి ఇన్స్పెక్టర్స్ మల్లేష్ జిల్లా ఇన్స్పెక్టర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠరథం ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో గురువారం కీర్తిశేషులు పబ్బ అంజయ్యరామవ్వల జ్ఞాపకార్థం జడ్పీటీసీ పబ్బమహేష్‌గుప్తా రూ. 2లక్షల80వేల సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వైకుంఠరథాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో జడ్పీటీసీ పబ్బమహేష్‌గుప్తా ముందువరుసలో ఉన్నారని, ప్రజలు వైకుంఠరథాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పద్మవెంకటేష్, గ్రామకమిటి అధ్యక్షులు లక్ష్మి నర్సయ్య, నాయకులు కృష్ణారావు, నాగేశ్వర్ రావు, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ నువ్వుల దశరథ, తదితరులు ఉన్నారు.

## భారీ మెజార్టీతో నీలం మధు విజయం

ప్రజాపక్షం/కౌడిపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెదక్ అభ్యర్థి నీలం మధు రెండు లక్షల మెజార్టీతో గెలుస్తారని మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం రోజు కౌడిపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 6 గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి పూర్తిగా అమలు చేశారని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి రాష్ట్రంలో అధికారంలో తెచ్చారని రాహుల్ గాంధీ ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త గ్రామంలలో మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు బీసీ బిడ్డ ను గెలుపునకు పనిచేశారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మెజారిటీ కోసం కష్టపడి పనిచేయడం జరిగిందని, కౌడిపల్లి మండలం నుంచి మంచి మెజార్టీని అందిస్తామని మెదక్ జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

## రిటైర్డ్ ఆర్టీసి ఉద్యోగి ఆత్మహత్య



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: ఆర్థిక ఇబ్బందులతో ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడపలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మునిగడప గ్రామానికి చెందిన పబ్బ ముత్యం(68) ఆర్టీసిలో డ్రైవర్‌గాపని చేసి గత ఎనిమిది సంవత్సరాల క్రితం పదవి విరమణ పొందారు. ఎలాంటి స్థిరాస్తులు లేని ఆయన తన కుటుంబ పోషణ కోసం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆటోలు సరిగా నడవకపోవడంతో ఆర్థికంగా కుంగి పోయిన ఆయన మానసిక వేదనకు గురైనట్లు తెలిపారు. ఆటో నడవక, కుటుంబ పోషణ భారమై బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. గురువారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతి గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

# తెలంగాణ చరిత్రను రూపుమాపాలని చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి

**ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి :** తెలంగాణ చరిత్రను రూపుమాపాలని చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండలోని హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాకతీయులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలు చేశారే కాని ప్రజా వ్యతిరేక పనులు చేయలేదన్నారు. కాకతీయులు టెంపుల్స్, ట్యాంక్స్, టౌన్ విధానంతో పాలన అందించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ కళా తోరణాన్ని అధికారిక చిహ్నం నుంచి తొలగిస్తే దశల వారిగా ఉద్యమం చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకోని వ్యక్తి చరిత్రపై అవగాహన లేని వ్యక్తి చరిత్రను చెరిపివేయాలని చూస్తున్నాడని అన్నారు. చరిత్ర గుర్తులు తొలగిస్తుంటే వరంగల్ జిల్లా మంత్రులు వ్యతిరేకించకపోవడాన్ని ప్రజలు గమనించాలన్నారు. నిజమైన కాంగ్రెస్ వాదులు రేవంత్ నిర్ణయాన్ని వ్యతిరేకించాలన్నారు. కేబినేట్‌లో నిర్ణయం తీసుకున్నప్పుడు మేమంతా వ్యతిరేకించామని, రేవంత్‌రెడ్డి చరిత్రకారులతో చర్చించి సబ్ కమిటీ వేస్తామని అన్నారని చెప్పారు. కాకతీయ కళా తోరణాన్ని తీసేస్తే చరిత్రను తీసేసిన ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. శుక్రవారం ఉదయం 11గంటలకు కాళోజీ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రతీ ఒక్కరూ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



**కాకతీయ కళా తోరణం రాచరిక చిహ్నం కాదు... పరిపాలన తీరుకు ప్రతిరూపం**

కాకతీయ కళా తోరణం రాచరిక చిహ్నం కాదు పరిపాలన తీరుకు ప్రతిరూపమని కేయూ బీఆర్ఎస్వీ నేత పిన్నింటి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర రాజముద్రలో కాకతీయ కళా తోరణాన్ని కొనసాగించాలనే కాకతీయుల చరిత్రపై పరిశోధన చేస్తున్న యువ చరిత్రకారుడు అరవింద్ పకిడే టార్చ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేశంలో కేయూ క్యాంపస్ విశ్రాంత చరిత్ర విభాగ అధిపతి ఆచార్య విజయ్ బాబు, మాజీ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, తొలిప్రేరని నృత్య బ్యాచ్ ప్రదర్శకుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తగా విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కాకతీయ కళా తోరణాన్ని రాచరికపు చిహ్నం అని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ మేనేజర్ రితిష్ కుమార్‌ని మాజీ ఉపముఖ్య మంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వినతిపత్రం అందజేశారు. గురువారం మండలంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌ను స్టేషన్‌ఘనపూర్‌కు మార్చారని తిరిగి బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ని జఫర్‌గడ్ మండలానికే మార్చాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి బ్యాంక్ జోనల్ మేనేజర్ రితీష్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌బీఐ అనుమతులు కూడా బ్యాంక్ జఫర్‌గడ్ నుండి పని చేయాలని ఉన్నాయన్నారు. బ్రాంచ్ ఏర్పాటుకు కావాల్సిన మౌళిక సదుపాయాలు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/రామాయంపేట :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామాయంపేట సిఐ వెంకటేష్ అన్నారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుఖాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా దుఖాణాదారులు వ్యవహరించాలన్నారు. నిబంధనల మేరకు విత్తన నియంత్రణ చట్టం 1983కు లోబడి వ్యాపారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అదీకృత విత్తన కంపెనీల నుండి మాత్రమే విత్తనాలు తేవాలని రవాణా సమయంలో ఇన్వాయిస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాన్నారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేసినప్పుడు రికార్డులు సరిగా ఉండాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈసమావేశంలో ఎస్ఐ రంజిత్ పాల్గొన్నారు.

## బిషప్ తుమ్మ బాల కన్నుమూత

**ప్రజాపక్షం/కాజీపేట :** భారతీయ ఫీఠాధిపతి, హైదరాబాద్ ఆర్చీ బిషప్, ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్, ది మోస్ట్ రెవరెండ్ ఫాధర్ తుమ్మ బాల గురువారం కన్నుమూశారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని దివ్య జ్యోతి నిలయంలో ఫాదర్ తుమ్మ బాల అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ది మోస్ట్ రెవరెండ్ ఫాథర్ తుమ్మ బాల మరణించిన విషయం తెలుసుకుని జిల్లా వ్యాప్తంగా పలువురు తరలి వచ్చి నివాళులు అర్పించారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్ కరుణాపురంలోని దివ్య జ్యోతి మందిరానికి చేరుకుని ది మోస్ట్ రెవరెండ్ ఫాధర్ తుమ్మ బాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ తుమ బాల మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బిషప్ ఉడుముల బాల, గురువులు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ కళాతోరణం రాచరికం కాదు మా ఓరుగల్లు రాజసం



**ప్రజాపక్షం/రాయపర్తి :** తెలంగాణలో కొత్తగా కొలువుతీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు విద్యార్థులు నిరుద్యోగులవి రైతుల సమస్యలు గాలికి వదిలేసి తెలంగాణ రాజముద్ర నుండి కాకతీయ కళాతోరణం తొలగించాలని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామని, బీజేవైఎం వరంగల్ జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల తో మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన రాజముద్రను ప్రవేశపెట్టడం ఆపివేయాలి లేదంటే ప్రజాగ్రహం కి గురి కావడం తప్పదని అన్నారు. బిజెవైఎం రాయపర్తి శాఖ తరపున ఉద్యమానికి సైతం సిద్ధంగా ఉన్నామని అన్నారు. జూన్ 6వరకు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఎన్నికల కమిషన్ చొరవ తీసుకొని దీన్ని నిలిపివేయాలని లేదంటే ప్రజలు సామాజిక ఉద్యమకారులు చేసే ధర్నాలకు అనుమతి ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కాకతీయ కళాతోరణాన్ని, తొలగించి నూతన రాజకీయానికి తెర లేపితే ప్రజాగ్రహంతోపాటు,బిజెపి పార్టీ సైతం ఉద్యమాలు చేస్తుంది. కాకతీయ కళ తోరణం అంటే ఓరుగల్లు ప్రజల పౌరుషానికి ప్రతీక, అస్తిత్వనికి చిరునామా, కాకతీయ కళ తోరణంలో రాజసం ఉంది తప్ప రాచరికం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అధికారిక చిహ్నం మార్పు అంశాన్ని పక్కన పెట్టాలని లేదంటే రాబోయే రోజుల్లో బిజేవైఎం ఆధ్వర్యములో ఉద్యమాలు చేసి, ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని , ఈ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.

## ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి జన్మదిన వేడుకలు భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రివర్యులు శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ రావు, జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి శ్రీధర్ బాబు ఎనలేని కృషి చేశారని, అధికారం చేపట్టాక రాష్ట్ర మంత్రిగా ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఐటి రంగాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లూరి సమ్మయ్య, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, చల్ల రేణుక, కొరిమిళ్ళ రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల మల్లేష్ గౌడ్, పైడిపల్లి రమేష్,



సహదేవ్, లక్ష్మారెడ్డి, కెవి అశోక్, సమ్మయ్య,మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### శ్రీధర్ బాబు జన్మదిన సందర్భంగా అన్నదానం

### ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భూపాల్ పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోతార్ల ప్రేమ్ కుమార్, మట్టెవాడ సురేష్ అఖిల్, అజయ్, మహేందర్, రాజు, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖలీమ్ వివాహ వేడుకలకు హాజరైన మల్లారెడ్డి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** మండలంలోని కుందారం గ్రామానికి చెందిన మహ్మద్ ఖలీమ్ వివాహ వేడుకలకు కాంగ్రెస్ పార్టి జిల్లా సీనియర్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టి మండల ఇంచార్జి బూడిద సదానందం గౌడ్, జీడికల్ దేవస్థాన చైర్మన్ ఏలె నర్సింహమూర్తి, కుందారం ఎంపిటీసీ రజిత ఉపేందర్, చీటూరు గ్రామ మాజీ సర్పంచ అయిల మల్లేష్, ఓబీసీ మండల ప్రెసిడెంట్ బండ రమేష్, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ నర్సింగ రమేష్, కుందారం గ్రామశాఖ అధ్యక్షులు అబ్బ సాయిలు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు తరలిపోకుండా కాపాడుకుందాం



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసును వ్యక్తిగత కక్షసాధింపు కోసం అనవసర రాద్ధాంతం చేయడం మంచిది కాదని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు కరుణాకర్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 40సంవత్సరాలుగా భీమదేవరపల్లి తాలూకా ఏర్పడినప్పటి నుండి మండలంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నాలుగు మండలాలకు సేవలు అందుతున్నాయన్నారు. ఐదారుగురు వ్యక్తులు ఆఫీస్ వద్ద డాక్యుమెంట్లు తయారు చేసే రైటర్ల నుండి డబ్బులు వసూలుకు ప్రయత్నిస్తే వారు ఇవ్వనందుకు ఆఫీసునే ఇక్కడనుండి లేకుండా చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక మహిళ సీనియర్ సబ్ రిజిస్ట్రార్ పైన ఇష్టం వచ్చినట్లు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. సదరు వ్యక్తుల ఆగడాలు తట్టుకోలేక ఆ మహిళా అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం జరిగిందన్నారు. వ్యక్తులను టార్గెట్ చేసి ప్రజోపకరమైన ప్రభుత్వ ఆఫీసులపై అనవసర ఆరోపణలు చేయవద్దని హితవు పలికారు. ఇక్కడ నుండి సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసును మరో ప్రాంతానికి తరలిపోకుండా కాపాడుకుందామని అన్నారు. మండల కేంద్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసారన్నారు. ఏండ్లు గడిచిన భవనం పిల్లర్ల దశలోనే నిలిచిపోయిందని, మంత్రి పొన్నం ప్రభాకర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చొరవ తీసుకుని నిలిచిపోయిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ నిర్మాణం పూర్తిచేయాలని విజ్ఞప్తి చేసారు.

## ఎజెన్సీలో పేద ప్రజలకు సర్వహక్కులు కల్పించాల్సిందే

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు) :** ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేదలకు భూమిపై, భుక్తిపై సర్వహక్కులు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులు, మధ్య తరగతి, భూమి ఉన్న వారు, భూమి లేని వారు నిరుపేద వర్గాల ప్రజలకు వేరు వేరుగా రిజర్వేషన్ కల్పిస్తూ, నిరుపేదలు అభివృద్ధిలోకి వచ్చేలా రాజ్యాంగంలో పొందు పరుస్తూ కొత్త జీవో జారీ చేయాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి ఈశ్వర్ నేతకాని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తరాలు మారిన నిరుపేదల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్న నిరుపేదలు పూట గడపుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని అన్నారు. పేదల కోసం అది చేస్తున్నాం ఇది చేస్తున్నాం ఇన్ని లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నామంటు లెక్కలు చెప్పే రాజకీయ పార్టీలు, పేదల బతుకులు ఎందుకు మారడం లేదో సమాధానం చెప్పాలని, ఆ లక్షల కోట్ల రూపాయలు ఎక్కడికి తరలి పోతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో నివసిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ పేదలకు, మధ్య తరగతి వారికి సరైన సౌకర్యాలు, సర్వ హక్కులు కల్పించేలా యుద్ధ ప్రాతిపదికన జివో జారీ ప్రవేశ పెట్టాలని రాజకీయ నాయకులను డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏజెన్సీ పీడిత పేద ప్రజల కోసం అవసరమైతే మరో ప్రజా యుద్ధ నౌక నైతానని, మరో ప్రజా పోరాటాలతో సమ్మె సైరన్‌కు శంఖారావం పూరిస్తానని అన్నారు.